andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 కనిష్ఠం 25.2
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 15 జూన్ 2024




జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం : ఎస్ఈ

నిర్మల్‌కల్చరల్, జూన్14: జిల్లాలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్లక్ష్యం, అవగాహనారాహిత్యంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం పరికరాలు వాడటం ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. రైతులు స్విచ్ బోర్డులు, మోటార్ స్టార్టర్ల వద్ద భద్రత పాటించకపోవడం ప్రమాదాలకు దారి తీస్తున్నాయని తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని సూచించారు.

చెరువు భూముల కబ్జాపై.. కదిలిన యంత్రాంగం!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ABN ఆంధ్రజ్యోతి

● భూముల కబ్జాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



● ఎర్రకుంట శిఖం భూమి రక్షణలో భాగంగా ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న అధికారులు



● పోలీసు బందోబస్తు మధ్య ట్రెంచ్ నిర్మాణ పనులు చేపట్టిన అధికారులు



● ఎర్రకుంట సమీపం నుంచి వెళుతున్న సరస్వతీ కాలువ

» ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ సీరియస్ » సాకెర ఎర్రకుంట భూముల స్వాధీనం » శిఖం, ఎఫ్‌టీఎల్‌ల ఆక్రమణలపై ఇక వరుస దాడులు

» నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ » ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులకు రంగం సిద్ధం

నిర్మల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల ఆక్రమణలపై కలెక్టర్ కొరడా ఝులిపిస్తున్నారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆగని ఆక్రమణ' పేరిట వచ్చిన కథనంపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. జిల్లా కేంద్రంలోని 12 గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. రాజకీయ నేతల అండదండలతో కొంతమంది సంబంధిత శాఖల అధికారుల సహాయ సహకారాలతో ఈ ఆక్రమణల పర్వం గత కొంతకాలంగా యథేచ్ఛగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలుసార్లు అధికారులు చర్యలు తీసుకున్నా ఆ చర్యలు కబ్జాదారులపై ఆశించిన మేరకు ప్రభావం చూపలేదని అంటున్నారు. అధికారుల తూతూమంత్రపు చర్యలు ఆక్రమణదారులకు వరంగా మారుతున్నాయన్న వాదనలున్నాయి. ఇందులో భాగంగానే చెరువు భూములకు ఆనుకొని ఉన్న పట్టాభూముల పేరిట కబ్జాదారులు శిఖం, ఎఫ్‌టీఎల్ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. చెరువుల సగభాగం వరకు మీరూఎర్రమట్టిని నింపుతూ పక్కభూమి పట్టా నెంబర్‌లతో ఆక్రమవెంచర్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చెరువుశిఖం భూముల్లో పెద్దఎత్తున ఆక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ ఆక్రమ వెంచర్లు, నిర్మాణాలపై అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఆశించిన మేరకు చర్యలు లేకపోవడం గమనార్హం. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మొదటి నుంచి చెరువు భూముల కబ్జాలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుసార్లు ఆయన శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల ఆక్రమణలపై కొరఢా ఝులిపించారు. అయితే రోజురోజుకూ ఈ ఆక్రమణల పర్వం హద్దులు దాటిపోతుండడం, చెరువుల సరిహద్దులు కుషించుకుపోతుండడం సహజంగా మారింది. రోజురోజుకూ ఇక్కడి గొలుసుకట్టు చెరువులన్నీ ఆక్రమణలతో చిన్నపాటి కుంటలుగా మారిపోతున్నాయి. ఈనేపథ్యంలో కలెక్టర్ కబ్జాలపై ఇక ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం నిర్మల్ పట్టణ సమీపంలోని సాకెరవద్ద గల ఎర్రకుంట శిఖం భూములను ఆక్రమణల చెరనుంచి స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇక వరుస దాడులకు ప్రణాళికను రూపొందించారు. ఇందులో బాగంగానే నెలరోజుల పాటు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ రికార్డుల ఆధారంగా కబ్జాలపై సీరియస్ చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటివరకు ఉన్న మాదిరిగా కాకుండా ఇక నుంచి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కలెక్టర్ రంగం సిద్ధం చేస్తున్నారు.

సాకెర ఎర్రకుంట భూముల స్వాధీనం

కొంతమంది రాజకీయ నేతల అండదండలు ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మల్ గొలుసుకట్టు చెరువులతోపాటు శివారుల్లో ఉన్న చెరువులు, కుంటల భూములను అధికారుల అండతోనే కబ్జాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నిర్మల్‌కు ఆనుకొని ఉన్న సాకెర ఎర్రకుంట చెరువు భూమిని పెద్దమొత్తంలో కబ్జాచేసి ఆ స్థలంలో ఆక్రమ వెంచర్‌ను ఏర్పాటుచేశారు. దీనిపై కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆ దిశగా దృష్టి సారించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. వీటిఆధారంగా ఎర్రకుంట భూములను స్వాధీనం చేసుకోవాలంటూ కలెక్టర్ హుకూం జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఉలిక్కిపడ్డ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ఎర్రకుంటకు వెళ్లి వెంచర్ పేరిట ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ఇకనుంచి వరుసగా నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ రూపొందించారు.

అడ్డగోలుగా ఆక్రమణలు

జిల్లాకేంద్రంలోని గొలుసుకట్టు చెరువుల శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను కొంతమంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పథకం ప్రకారం అడ్డగోలుగా కబ్జాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల ధనాపేక్షతో ఆక్రమణదారులు కొంతకాలంగా నుంచి రెచ్చిపోతున్నారు. చెరువు భూముల కబ్జాలతో ప్రస్తుతం ఆ చెరువులన్నీ చిన్న కుంటలుగా మారిపోతున్నాయి. ప్రస్తుతం ఇక్కడి అనేక గొలుసు కట్టు చెరువులు తమ రూపురేఖలు కోల్పోయాయని అంటున్నారు. ప్రతీఏటా వేసవిలో చెరువుభూముల హద్దులను కాపాడేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉన్నా వారి నిర్లక్ష్యం కారణంగా కబ్జాల పరంపర యథేచ్ఛగా కొనసాగుతుందని అంటున్నారు.



భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● మధుకర్, సోన్ మండల ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వరుసగా తనిఖీలు జరుపుతాం. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయించేందుకు వెనకాడలేది లేదు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో
అవకతవకలపై విచారణ చేపట్టాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 14: ఉపాధ్యాయుల బదిలీల సందర్భంగా విద్యాశాఖ రూపొందించిన సీనియారిటీ జాబితాలో అవకతవకలు జరిగాయని, అవకతవకలపై విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమోషన్లు రెండుసార్లు తిరస్కరించిన వారి పేర్లను జాబితాలో చేర్చారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ వెంకట్రావు, రాజేష్ నాయక్, క్రాంతి కుమార్, అన్సారీ, నబీబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల పోలీస్‌స్టేషన్ తనిఖీ

కుంటాల, జూన్ 14: కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సీఐ నైలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, కేసులను పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. ఈయన వెంట ఏఎస్సై రాందాస్, సిబ్బంది ఉన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూన్ 14: జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం చీఫ్ కమిషనర్ అడ్మిన్ ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం ప్రజావాణి, ధరణి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ వాటిపై తీసుకుంటున్న చర్యలు చర్చించారు. ధరణి, ప్రజావాణి, వివిధ మాడ్యూల్, కోర్టు కేసులపై కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా తీసుకుంటున్న చర్యలపై వారితో చర్చించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

'ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయండి'

నిర్మల్ కల్చరల్, జూన్14: అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు ఉమామహేశ్వర్‌రెడ్డి డిప్యూటేషన్ రద్దు చేయాలని ప్రైమరీ టీచర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ విషయమై సంఘం నాయకులు శుక్రవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమామహేశ్వర్‌రెడ్డి పనిచేసే కాలం 2021తో ముగిసినా ఇంకా అనధికారికంగా కొనసాగుతున్నాడని పేర్కొన్నారు. 317జీవో ట్రాన్స్‌ఫర్ల సందర్భంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న భోజన పథకం, పుస్తకాల పంపిణీ తదితర వాటిలో అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాజిద్ పాల్గొన్నారు.

స్నానానికి వెళ్లి.. గోదావరిలో మునిగి యువకుడి మృతి



మృతుడి వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై

లోకేశ్వరం, జూన్14: స్నేహితులతో కలిసి సరదాగా స్నానం చేసేందుకు గోదావరి నదికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన ఘటన లోకేశ్వరంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన రాపతి భోజయ్య (28) గురువారం సాయంత్రం మిత్రులతో కలిసి పంచగుడి బ్రిడ్జి సమీపంలో గోదావరి నదిలోకి స్నానానికి వెళ్లాడు. నది నీటిలోతును అంచనా వేయకుండా లోపలికి వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడని తెలిపారు. స్నేహితుల సమాచారంతో కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి వెళ్లి అక్కడి మత్స్యకారులతో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. శుక్రవారం ఉదయం ఎస్సై గాలింపు చేపట్టడంతో మృతదేహం లభ్యమైందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

● ఎస్సై మునిగెల హన్మాండ్లు

నర్సాపూర్(జి), జూన్ 14: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని నర్సాపూర్(జి) ఎస్సై మునిగెల హన్మాండ్లు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనారిటీలు బక్రీద్ పండుగను శాంతియుతంగా సంతోషంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవులను అక్రమంగా రవాణా చేయవద్దని, గోవులను వధించడం నేరమని అన్నారు. ఎవరైనా గోవులను అక్రమంగా రవాణా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా గోవులను రవాణాచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భైంసా డివిజన్‌లో భారీ వర్షం

భైంసా, జూన్ 14: నైరుతి రుతుపవనాల ప్రభావంతో డివిజన్ పరిధిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా రెండున్నర గంటలకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సాగుకు అనుకూలమైన వాతవరణం ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు నీటితో నిండి చిన్నపాటి చెరువులను తలపించాయి. మురికి కాలువలు పొంగి ప్రవహించడంతో వాటిల్లోని వ్యర్థాలు, చెత్తా చెదారం రోడ్లపై పేరుకుపోయాయి.



భైంసాలో జలమయమైన పంట చేలు

రైతుల ప్రతీ కొనుగోలుకు రశీదు ఇవ్వాలి

● ఎరువుల స్టాకు వివరాలను బోర్డుపై ప్రదర్శించాలి ● రశీదులో పేర్కొన్న డబ్బులనే తీసుకోవాలి: జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్

లోకేశ్వరం, జూన్ 14: రసాయన ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణ యజమానులు రైతుల ప్రతీ కొనుగోలుకు రశీదు ఇవ్వాలని, పూర్తి వివరాలతో కూడిన రశీదులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్ అన్నారు. లోకేశ్వరం మండలకేంద్రంలో గల ఎరువులు, విత్తనాల దుకాణాలలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో బోర్డులు ఏర్పాటుచేసి ప్రతీ రోజు స్టాక్ వివరాలు తప్పకుండా ప్రదర్శించాలని సూచించారు. అలాగే రైతులకు నిర్ణీత ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలని, రశీదులో పొందుపరిచిన డబ్బులను మాత్రమే తీసుకోవాలని, అదనంగా వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులను మోసం చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయనతోపాటు టెక్నికల్ ఏవో వినోద్, లోకేశ్వరం మండల వ్యవసాయ శాఖ అధికారి గణేష్‌లు పాల్గొన్నారు.



● ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్ ఏడీఏ

ఎంపీపీపై కేసు నమోదు

కుంటాల, జూన్ 14: ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ తనతో దురుసుగా ప్రవర్తించాడని, అసభ్యకరంగా మాట్లాడాడని వైద్యాధికారిణి శృతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుంటాలలోని స్థానిక రైతువేదికలో గురువారం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో కుంటాల ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ వైద్యాధికారిణి శృతి పట్ల దురుసుగా ప్రవర్తించాడని, అసభ్యకరంగా మాట్లాడారని ఆమె కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎంపీపీపై సెక్షన్ 186, 506, 509 సెక్షన్ల కింద కేసునమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సైరాందాస్ పేర్కొన్నారు.

● విధులు నిర్వహించలేదన్నందుకే నాపై కేసు: ఎంపీపీ

కుంటాల వైద్యాధికారిణి శృతి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని చెప్పినందుకే తనపై కేసు పెట్టారని ఎంపీపీ అప్క గజ్జారాం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాను ఒక ఎంపీపీగా మండల ప్రజలకు సేవలందించడంలో వైద్యాధికారిణి నిర్లక్ష్యం వహిస్తున్నారని, విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించినందుకే తనపై ఉద్దేశపూర్వకంగా కేసు నమోదు చేశారని అన్నారు. వైద్యాధికారిణి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కట్టరవి, అందకూర్ ఎంపీటీసీ మధుకర్, మాజీ సర్పంచ్ ఎగ్గాం గజ్జారాం, నాయకులు గుద్దేటి నర్సయ్య, పసుల నవీన్, సోమ రాజు, బోగ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

'ఏఐటీయూసీ బలోపేతానికి కృషి'

నిర్మల్‌కల్చరల్, జూన్14: ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. శుక్రవారం గౌరవ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్ సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాటానికి తీర్మానాలు చేశామని చెప్పారు. అంగన్‌వాడీ, భవన నిర్మాణ, మున్సిపల్, ఎండీఎం కార్మికుల సమస్యలపై పోరాటానికి తీర్మానం చేసినట్లు వెల్లడించారు. శ్రీనివాస చారి, పి.ముత్యం, భూక్యా రమేష్, ఎల్ఆర్ ఉపాలి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్(జి), జూన్14: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కోడె వేదాగ్న, కదం అమరబోధి, కేదేరావు, ప్రదీప్, బాయమొల్ల రిశులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెడ్‌మాస్టర్ కిషన్ రావ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతీఏటా రూ. 12వేల స్కాలర్‌షిప్ పొందుతారని తెలిపారు.

రక్తదాతలకు సన్మానం

నిర్మల్ కల్చరల్, జూన్14: అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కావేటి పోతమ్మ చారిటబుల్ ట్రస్ట్, నిర్మల్ సేవా సమితి ఆధ్వర్యంలో అత్యధికంగా రక్తదానం చేసిన వారిని కస్బా స్కూల్‌లో వై.సాయన్న, గంగిశెట్టి ప్రవీణ్‌లను సన్మానించారు.

● ఉత్తమ రక్తదాతగా డాక్టర్ వేణుగోపాలకృష్ణ

నిర్మల్ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఉత్తమ రక్తదాతగా ప్రశంసలు అందుకున్నారు. ప్రపంచరక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ గోపాలకృష్ణను అభినందిస్తూ సన్మానించారు. ఇప్పటివరకు 56సార్లు రక్తదానం చేసి స్ఫూర్తినిచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి రాజేందర్, సూపరింటెండెంట్ సరోజ ఉన్నారు.

మాంగ్ సమాజ్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

మావల, జూన్ 14: మాంగ్ సమాజ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా లహుజీ సాల్వే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అన్న బహు సాటే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల చివరి వరుసలో ఉన్న సమాజం మాంగ్ సమాజ్ అని అన్నారు. ఈ సమాజానికి ఎంత చేసిన తక్కువేనని, వారికి ఇప్రభుత్వ ఫలాలు ఇంకా అందాల్సి ఉందని, వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. నేడు రూ.20 లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు రాష్ట్ర పాల్, సుభాష్, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలి : సీసీఎల్ఏ కమిషనర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14: ధరణి మాడ్యుల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరితగిన పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సీసీఎల్ఏ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షిసా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవోలు, మండల తహసీల్దార్‌లు పాల్గొన్నారు. అనంతరం ఆరు జిల్లాలు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్‌లతో మాట్లాడుతూ జిల్లాలో ధరణి, ప్రజావాణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తహసీల్దార్‌లతో మాట్లాడుతూ మండలంలోని ధరణి మాడ్యుల్స్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయ స్థాయిలో పరిశీలన చేసి వాటిని క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ అన్నిస్థాయిలో ప్రాధాన్యత పరంగా దరఖాస్తులను ప్రతీరోజు మానిటర్ చేస్తూ డిస్పోజల్ చేయాలని తెలిపారు. అలాగే విత్తనాల దుకాణాలను తనిఖీ చేయాలని, గోదాములు చెక్ చేయాలని, ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారా? ఆరా తీయాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపించినందున లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి, ముంపు ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. తహసీల్దార్లు ఈ సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలని, హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలని తెలిపారు. ఇందులో అధికారులు, తదితరులున్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి : మాదిగ జేఏసీ

ఆదిలాబాద్ రూరల్, జూన్ 14: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మాదిగ జనసభ కార్యక్రమాలను చేపడుతున్నట్లు మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మనోజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదిగ జనసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి మాదిగ జన సభ పాల్వంచ నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క రాందాస్ మాదిగ, జిల్లా కార్యదర్శులు తారా రవికుమార్ కత్తి గంగాధర్, జిల్లా నాయకులు జెల్లా మహేందర్, కొల్లూరు స్వామి, చొప్పదండి భూమన్న, బట్టు మహేందర్, గజ్జల విలాస్ పాల్గొన్నారు.

లేఖర్‌వాడలో గాలివాన బీభత్సం

● పలుచోట్ల విరిగి పడిన విద్యుత్ స్తంభాలు ● గ్రామాల్లో కూలిపోయిన పెంకిటిళ్లు ● ప్రజలకు తప్పిన ఘోర ప్రమాదం

జైనథ్, జూన్ 14: మండలంలోని లేఖర్‌వాడ గ్రామంలో గురువారం రాత్రి గాలివాన భీభత్సవంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గ్రామంలో జరిగిన ఈ గాలివాన భీభత్సవంతో ఆరు విద్యుత్ స్థంబాలు ఎక్కడికి అక్కడే నేలకొరిగాయి. దీంతో పాటు విద్యుత్ స్తంభాలు జనవాసాలపై విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రజలకు ఘోర ప్రమాదం తప్పింది. దీంతో పాటు గాలివాన భీభత్సవంతో గ్రామంలో ఆరు పెంకిటిల్లు, ఆరు పశువుల పాకలు పూర్తిగా కూలిపోయాయి. దీంతో లేఖర్‌వాడ గ్రామంలో సుమారు లక్షల్లో ఆస్థి నష్టం సంబవించింది. దీనిపై ప్రభుత్వం మండల ప్రజాప్రతినిధులు అధికారులు తగు చర్యలు తీసుకొని బాధితులకు ప్రభుత్వ పరంగా ఆర్థికంగా ఆదుకోవాలని లేఖరవాడ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

● భారీ వర్షం.. రైతన్న హర్షం

బోథ్: మండలంలోని కనుగుట్ట కౌటా(బి), సోనాల తదితర గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. గత మూడు రోజుల క్రితం నాటిన విత్తనాలు వర్షంతో మొలకెత్తే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈసారి వర్షం మండలంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో వైపు వర్షం కురుస్తుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

● 'విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు'

సిరికొండ: వానాకాలం విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ సుభాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం సిరికొండ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం వల్ల విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం కలుగడంతో శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో విద్యుత్‌లైన్లపై చెట్లు విరిగిపడటం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడిపోవడం వంటి ఘటనలు జరుగుతుంటాయని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎవరికీ ఇబ్బంది కలుగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈ రోహిదాస్, లైన్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, లైన్‌మెన్ లింగన్న, మహేష్, ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.



గాలివానకు లేఖర్‌వాడలో కూలిపోయిన ఇల్లు



గ్రామంలో జనావాసాల మధ్య తెగిపడిన విద్యుత్ స్తంభం





గాలికి వంగిపోయిన విద్యుత్ స్తంభం.. ఎగిరిపడిన రేకులు



కౌటా(బి) గ్రామంలో కురుస్తున్న వర్షం



డొంగార్‌గావ్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న డీఈ



కొకస్‌మన్నూర్‌లో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇంటింటి సర్వేలో వివరాల సేకరణ

ఇచ్చోడ, జూన్, 14: మండలంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా తీరుపై గ్రామ పంచాయతీ, ఐకేపీ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. నూతనంగా ఎవరైన ఇళ్ల నిర్మాణం చేసుకుని దరఖాస్తు చేస్తే కుళాయిల ఏర్పాటు చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఎంపీడీవో లక్ష్మణ్ సర్వే పనులను నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో జరిగే సర్వే పనులపై ఆయన ఆరా తీశారు.

బోథ్: మిషన్ భగీరథ వినియోగంపై పూర్తి వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించడంతో మండలవ్యాప్తంగా మండల స్థాయి అధికారులతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంటింటా తిరిగి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఉందా? భగీరథ నీరు వస్తుందా? అనే విషయాలను అధికారులు సేకరిస్తున్నారు.

'రక్త దానానికి ముందుకు రావాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 14: రక్తదానం అంటే ప్రాణదానమేనని, రక్తదానంపై అపోహలు వీడి 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్ రక్తనిధి కేంద్రంలో సేవా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేస్తే మూడునిండు ప్రాణాలు నిలబడుతాయన్నారు. ఇందులో అదనపు డీఎంహెచ్‌వో గజానన్, వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'రేషన్ సకాలంలో పంపిణీ చేయాలి'

తాంసి, జూన్ 14: ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు ప్రతినెల రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరుకులు అందించాలన్నారు. ముఖ్యంగా చివరి రోజున గ్రామంలో ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రతీఒక్కరు రేషన్ బియ్యాన్ని తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్, జూన్ 14: మండలంలోని వర్తమన్నూర్ గ్రామంలోని ఈదుల లింగన్నకు చెందిన ఇల్లు గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీంతో ఇంటిలో ఉన్న నిత్యావసర సామగ్రితో పాటు, దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న మండల రెవెన్యూ సిబ్బంది బాధితుడి ఇంటికి వెళ్లి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ మాట్లాడుతూ దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపరిహారం అందించాలని బాధితులు మొరపెట్టుకున్నారు. అలాగే బీఎస్పీ స్టేట్ ఈసీ మెంబర్ మేస్రం జంగుబాబు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరుపున జరిగిన నష్టానికి వెంటనే పరిహా రం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూన్ 14: ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం జరుగు తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని రాజురా గ్రామంలోని ప్రభుత్వ పాశాలలో బడిబాట కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులకు యూనిఫాంలు అందజేసి చాక్లెట్లను పంచారు. విద్యార్థులు అందరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని అన్నారు. తాను కూడా ఇదే రాజురా పాఠశాలలో చదువుకొని ఎమ్మెల్యేగా ఎదిగానన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. వీరి వెంట ఎంపీపీ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

● 'వంతెన నిర్మాణం పనులను వేగవంతం చేయాలి'

నేరడిగొండ: వంతెన నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజురా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నూతనంగా నిర్మిస్తున్న లోలెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న సైడ్ డ్రైన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.అలాగే లోలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో పూర్తిగా నాణ్యతతో బ్రిడ్జి నిర్మాణం చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. వర్షాల నేపథ్యంలో బ్రిడ్జికి వెళ్లడానికి ముందు మొరం రోడ్డు వేసుకోవాలని, తర్వాత రైతులను ఇబ్బంది పెట్టొద్దు అన్నారు. వీర వెంట ఎంపీపీ సజన్, వీడీసీ రవీందర్, గులాబ్, తదతరులున్నారు.

● 'చెట్లె ప్రగతి మెట్లు'

నేరడిగొండ: మండలంలోని కుప్టి గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చెట్లను నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లె ప్రగతికి మెట్లని, ఎంత ఎక్కువ చెట్లను పెంచితే అంత మంచిదని అన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బీడీ కార్మికులతో ముచ్చటించారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట సజన్, నేరడిగొండ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, శేఖర్‌తో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల సామూహిక అక్షరాభాస్యం

ఉట్నూర్, జూన్ 14: మండలంలోని ఘన్‌పూర్‌లో మండల పరిషత్ పాఠశాలలో ఎంపీపీ పంద్రజైవంత్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరై ఎంపీపీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఎంపీపీ, ఉపాధ్యాయులు సరస్వతీ పూజలు నిర్వహించి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు చేతులు పట్టి అక్షరాలు రాయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీవో లీడర్లు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా సామూహిక అక్షర భ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు నూతనంగా వచ్చిన విద్యార్థులందరికీ ప్రజాప్రతినిధులతో, అధికారులతో అక్షరభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఆదర్శ అమ్మ పాఠశాల ద్వారా నిధులు కేటాయించి పనులు చేపడుతుందన్నారు. ఇందులో జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మీ రాజేశ్వర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, రమణ పద్మ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షర శ్రీకారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో చిన్నారులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో అక్షరభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. బడి బయట ఉన్న, బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు.



పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి ఉమెన్స్ ఉషు పోటీలకు నలుగురు క్రీడాకారుల ఎంపిక

భైంసా, జూన్ 14: జూలైలో జరుగనున్న జాతీయస్థాయి ఉష ఉమెన్స్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి 13 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోటలో జరిగిన సౌత్ జోన్ పోటీలలో జిల్లా ఖేలో ఇండియా కేంద్రం ద్వారా శిక్షణ పొందిన 9మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం శిక్షకుడు శ్రీరాముల సాయికృష్ణ సారథ్యంలో జిల్లా క్రీడాకారుల బృందం సౌత్‌జోన్ ఎంపిక పోటీలకు వెళ్లింది. ఇందులో జియాన్సు సీనియర్ విభాగంలో ఎల్.రాజశ్రీ, 42 కేజీల జూనియర్స్ విభాగంలో జె.ప్రణతి, 45 కేజీల సీనియర్స్ విభాగంలో ఎ.ప్రతీక్ష, 52 కేజీల విభాగంలో ఎండీ అస్మాలు ప్రతిభను కనబరిచి కాంస్య పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇక జిల్లా నుంచి పాల్గొన్న మిగతా క్రీడాకారులు ఎ.మృణాళిని (7వ స్థానం), జి.అనన్య (8వ స్థానం), ఎస్.విద్య, బి.విజేతలు (9వ స్థానాల్లో) నిలిచారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జిల్లా క్రీడల అధికారి ఎం.ఎ.నఫేఖాన్, జిల్లా మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడుతేజేందర్ సింగ్ బాటియా, ప్రతినిధులు శ్రీకాంత్, శివరాజ్‌గౌడ్, నితిన్‌గౌడ్, లింగం అభినందించారు.

జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో ఖానాపూర్ యువకుడి ప్రతిభ

ఖానాపూర్, జూన్14: ఈనెల 6 నుంచి 11 వరకు కులుమనాలిలో సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో ఖానాపూర్ యువకుడు బి.రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచాడు. సిగ్మా ఆర్ట్స్ ఫోటోగ్రఫీ 90వ వర్క్‌షాప్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఖానాపూర్‌కు చెందిన రాజ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ పతకాన్ని సిగ్మా అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్‌కుమార్‌ను ఫొటోగ్రాఫర్లు ఘనంగా సన్మానించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

కుంటాల, జూన్, 14 : వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలలో అందుబాటులో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని డీఏవో అంజి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుంటాల రైతు వేదికలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పత్తి,సోయా, మొక్కజొన్న తదితర పంటలను వేసుకునే అవకాశం ఉన్నందున రైతులకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఏవోతో పాటు ఏఈవోలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వీణ, ఏవో సోమలింగా రెడ్డి, ఏఈవోలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అంజిప్రసాద్



అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

మహాగాం గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

భైంసారూరల్, జూన్14: మండలంలోని మహాగాం గ్రామానికి శుక్రవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ తొందరగా అందించాలని అధికారులకు సూచించారు. సరైన కొలతలు కుట్టి విద్యార్థులకు తొందర గా అందించాలని ఆదేశించారు. మండలంలోని అన్నిస్కూళ్లకు యూనిఫామ్ సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, ఏపీవో శివలింగయ్య, ఎంఈవో సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని..
గ్రామ దేవతలకు గంగాజలాలతో అభిషేకం

ముథోల్, జూన్ 14: మృగశిర కార్తె ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా వరుణ దేవుడు కనికరించడం లేదని మండలంలోని చించాల గ్రామస్థులు శుక్రవారం గ్రామ దేవతలకు గంగాజలంతో జలాభిషేకం చేశారు. బాజాభజంత్రీలతో గ్రామంలోని రాజరాజేశ్వరాలయం, హనుమాన్ ఆలయం తదితర ఆలయాల్లో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం చివర ఉన్న రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామస్థులు అందరూ తమ ఇంటి నుంచి తీసుకొచ్చిన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి సమృద్ధిగా వర్షాలు కురువాలని వేడుకున్నారు. పాడి పంటలతో అందరూ సంతోషంగా ఉండాలని గ్రామదేవతలను కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయం వద్దనే గ్రామస్థులు భోజనాలు చేశారు.



గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న గ్రామస్థులు


కారం కాయకు భలే డిమాండ్

● ఒక్కటికి రూ.15 చొప్పున విక్రయిస్తున్న రైతులు, వ్యాపారులు ● మామిడి పండ్లకు లేని డిమాండ్ కాయలకు..


భైంసా, జూన్ 14: ఈఏడాది మామిడి పంటకు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత సంవత్సరంతో పోల్చితే దిగుబడులు అధికంగా రావడంతో ఈసారి 50 శాతం ధరలు తగ్గిపోయాయి. పేరుగాంచిన పండ్లకు సైతం పెద్దగా ధరలు లేకుండాపోయాయి. పెద్దమార్కెట్లకు ఏమైనా ధర వస్తుందేమోనని ఆశించిన రైతుకు అక్కడా నిరాశే మిగిలింది. అయితే మామిడి కారానికి ఉపయోగించే కాయలకు మాత్రం భలే డిమాండ్ ఏర్పడింది. వాటి ధర మరోలా ఉంది. భైంసా మార్కెట్‌లో వారం రోజులుగా కారం కాయల అమ్మకం జోరుగా సాగుతోంది. సైజును బట్టి కాయలు అమ్ముడుపోతున్నాయి. చిన్నసైజులు ఉన్న మామిడి కాయ రూ.10 కు, కాస్త పెద్ద సైజులో ఉంటే రూ. 12 నుంచి రూ. 15 కు అమ్ముడుపోతున్నాయి. పండ్లకు లేని ధర కారం కాయలకు ఉండడంతో చాలా మంది మామిడి వ్యాపారులు ప్రస్తుతం కారం కాయల వైపు దృష్టి మళ్లించారు.

● ఘాటెక్కిన మామిడి కారం..

కారం కాయల ధరలు ఆకాశాన్ని తాకడంతో చాలామంది మామిడికారం తయారు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. గతేడాది రూ.8 నుంచి రూ. 10కు ఒక కాయ అమ్ముడుపోగా ఇప్పుడు మాత్రం ఏకంగా రూ.12 నుంచి రూ.15 ధర పలకడంతో వినియోగదారులు వెనుకడుగు వేస్తున్నారు. కారం కాయల ధరలు అధికంగా పలకడంతో కొద్దిరోజులు ఆగితే ధర తగ్గకపోదా అని చాలా ఇళ్లలో మామిడి పచ్చడి తయారు చేసుకునే ఆలోచనను పొడగిస్తున్నారు. అయినప్పటికి మామిడి కారం తప్పనిసరి అనుకున్న వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. మరోవారం పది రోజుల దాటితే కారం తయారుకు గడువు దాడిపోతుందనే ఉద్దేశంతో కొనుగోలు చేస్తున్నట్లు మామిడిపచ్చడి ప్రియులు చెబుతున్నారు. హోటళ్ల, కర్రీ పాయింట్‌లో తప్పనిసరి కావడంతో పచ్చడి ప్రియులు ఎక్కువ ధర వెచ్చించి కారం కాయలను కొనుగోలు చేస్తున్నారు.



అమ్మడానికి సిద్ధంగా మామిడి కాయలు



కాయలను ముక్కలు చేస్తున్న దృశ్యం



పోలీసు కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నూతన పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ రూరల్, జూన్14: నూతనంగా నిర్మించనున్న నిర్మల్ రూరల్ జిల్లా నూతన పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా నిర్మల్ మండలం ఎల్లపెల్లి గ్రామంలో గల సర్వే నెంబర్ 459లో నూతనంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

తలమడుగు, జూన్14: మనిషికి మానసిక ప్రశాంతత ధ్యానంతోనే లభిస్తుందని, ప్రతిఒక్కరూ వారి వయసును ధ్యానం అలవర్చుకోవాలని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీశ్రీ పరమహంస సద్గురు ఫులాజీ బాబా ధ్యాన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ధ్యాన మందిరంలో దాదాపు 200 మంది భక్తులు ఉన్నారని, ఈ ధ్యాన కేంద్రాన్ని మరింత అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ధ్యాన మందిరంలో బోర్ వేయించి మోటార్ బిగించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రహరీ, గేట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రి సీతక్క సహాయంతో షెడ్డు నిర్మిస్తామని హామీనిచ్చారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న హరితహారం కార్యక్రమాన్ని ధ్యాన మందిరం నుంచి ప్రారంభిస్తామని అందుకు తగినఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇందులో ఎంపీపీ కళ్యాణలక్ష్మీ రాజేశ్వర్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి దుద్రమ్ రాథోడ్, ధ్యాన మందిరం కమిటీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నీలగిరి అశోక్, మండల విద్యాధికారి నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీటీసీ చంటి, పెందూర్ మాధవ్, ప్రకాష్‌రావు, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మాజీ ఎంపీ

ఉట్నూర్, జూన్ 14: ఆదిలాబాద్ నూతన పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్‌ని మర్యాదపూర్వకంగా మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాథోడ్ రమేష్ శుక్రవారం కలిశారు. ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన విధంగానే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేస్తానని ఎంపీ నగేష్ హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, నాయకులు రాజశేఖర్, బింగి వెంకటేశ్, కాల్వ రవి తదితరులున్నారు.

● ఎంపీని కలిసిన మండల నాయకులు

సోనాల, జూన్ 14: ఎంపీగా గెలుపొందిన గోడం నగేష్‌ని ఆయన నివాసంలో మండల నాయకులు, సోనాల మండల, బోథ్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సోనాల, బోథ్ మండల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు.

'దివ్యాంగుల పింఛన్ల పంపిణీలో ఆలస్యం వద్దు'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 14: దివ్యాంగుల పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయొద్దని దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నగేష్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దివ్యాంగుల సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చినహామీ మేరకు ప్రతినెల పింఛన్లను పంపిణీ చేయాలని కోరారు.




విత్తనాలు వేస్తున్న రైతులు



● పంట పొలాన్ని చదును చేస్తున్న రైతు

రైతుబంధు.. ఇంకెప్పుడు!?

- జిల్లాలో లక్షా 63వేల 359 మంది రైతులు ఎదురుచూపులు
- పంటల సాగు ప్రారంభమైనా.. అందని పెట్టుబడి సహాయం
- మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకే పరుగులు తీస్తున్న రైతులు
- ఈసారి పెట్టుబడి సహాయం మరింత ఆలస్యమయ్యే అవకాశం
- ఇంకా విధి విధానాలు ఖరారు కాలేదంటున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా రూ.287కోట్ల 28లక్షల 51వేల 984 నిధులు అవసరమని అంచనా



ఆదిలాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధు పథకం కింద అందించే పెట్టుబడి సహాయం ఆలస్యం కావడంతో అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని యాసంగి, వానాకాలం సీజన్ పంటల సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందిస్తూ వస్తుంది. ఇప్పటికే జిల్లాలో వానాకాలం పంటల సాగు పనులు ప్రారంభమైనా.. ప్రభుత్వం రైతుబంధు పథకం ఊసెత్తక పోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. గడిచిన యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సహాయం ఆగుతూ.. సాగడంతో ఈసారి రైతుబంధు ఎప్పుడొస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో లక్షా 63వేల 359 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులని అధికారులు గుర్తించారు. ఇందుకు గాను రూ.287కోట్ల 28లక్షల 51వేల 984 నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అధికారులు లక్షా 58వేల 989 మంది రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి ఇందులో లక్షా 58వేల 982 మంది ఖాతాలను పరిశీలించారు. అయితే ఇప్పటి వరకు విధివిధానాలు ఖరారు కాలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వానకాల సీజన్ ప్రారంభమైనా.. పెట్టుబడి సహాయం అందకపోవడంతో రైతులు అప్పులు చేస్తూ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 50 శాతం పత్తి, సోయా, కంది పంటల సాగు పూర్తయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిస్తే పంటల సాగు పూర్తయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కరకు రాని పెట్టుబడి సహాయం


రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపే లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తొలకరి వర్షాలకే రైతులు వానాకాలం పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం అక్కరకు రాకుండానే పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సహాయం మే మాసంలోనే అందిస్తే విత్తనాలు ఎరువులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడేవని రైతులు చెబుతున్నారు. అప్పు చేసి పంటలను సాగు చేసిన తర్వాత పెట్టుబడి సహాయాన్ని అందించినా.. ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముందస్తుగా పెట్టుబడి సహాయాన్ని అందిస్తే పంటల సాగు సకాలంలో పూర్తయి దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉందంటున్నారు. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేక చిన్న, సన్నాకారు రైతులు పంటల సాగును ఆలస్యం చేయడంతో చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకు రుణాలు కూడా ఆలస్యం కావడంతో పెట్టుబడి కోసం రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇచ్చేదేదో పంటల సాగు సీజన్‌కు ముందే ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధిక వడ్డీలకు అప్పులు

సమయానికి ప్రభుత్వ సహాయం అందకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ పంటలను సాగు చేస్తున్నారు. మే మాసంలోనే పెట్టుబడి సహాయాన్ని సమకూర్చుకుని తొలకరి వర్షాలు కురవగానే పంటలను సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా.. రైతుబంధు రాకపోవడంతో అన్నదాతలు అప్పుల కోసం ఆరాట పడుతున్నారు. వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తూ అధిక వడ్డీలకైనా అప్పులు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బంగారు నగలను కుదవ పెట్టి మరీ పెట్టుబడి సహాయాన్ని సమకూర్చుకుంటున్నారు. జిల్లాలో కొంతమంది దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటూ.. అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. 10 నుంచి 25 శాతం వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. పంట చేతికి రాగానే అసలుతో పాటు వడ్డీని వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేసిన కష్టమంతా దళారుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నామని చెబుతున్నా.. అది ఏమూలన సరిపోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. బ్యాంకులు కూడా సమయానికి రుణాలు ఇవ్వక పోవడంతో వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు.

మార్పులు చేర్పులు

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుబంధు పథకం అమలులో కొన్ని మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకు సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఎన్ని ఎకరాలు ఉన్నా- రైతుబంధు అందింది. కానీ దీనిపై భిన్నాభిప్రాయాలు, పలు విమర్శలు రావడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తుంది. గరిష్ఠంగా ఎన్ని ఎకరాల వరకు రైతుబంధును ఇస్తే బాగుంటుందనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు కటాఫ్ ఉంటుందన్న ప్రచారం జరుగుతుంది. వందల ఎకరాలు ఉన్న రైతులకు ఈసారి రైతుబంధు ఇస్తారా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కూడా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఎకరాన యేడాదికి రూ.15వేలను అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే గుట్టల భూములు, వెంచర్లకు ఈసారి రైతుబంధు ఇవ్వడం అనుమానంగానే కనిపిస్తుంది. పూర్తిస్థాయిలో పంటల సాగు సర్వే చేసిన తర్వాతనే పెట్టుబడి సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలు ఖరారు కాలేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీని చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో ఈసారి పెట్టుబడి సహాయం అందడం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు లేకపోలేదు.






విత్తనాల విక్రయ దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

'రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు'

తలమడుగు, జూన్ 14: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'రైతులను నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు' అనే కథనం ప్రచురణ కావడంతో స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మండలంలోని సుంకిడిలో గల పత్తి విత్తనాల విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతుల విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా నాణ్యమైన కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అంతేకాకుండా విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రసీదులో కంపెనీ పేరు ముద్రించిన తేదీ, ఎక్స్‌పైర్ డేట్ తదితర వాటిని రషీదులో డీలర్లు నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా రైతులకు ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలు విక్రయించాలన్నారు. ముఖ్యంగా రైతులు రెండు, మూడు వర్షాలు పడ్డ తర్వాతే విత్తనాలు నాటాలన్నారు. భూమిలో తేమశాతం తక్కువ ఉంటే విత్తనాలు మొలకెత్తవన్నారు. విత్తనాలపై గ్రామాల్లో రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విత్తనాల విక్రయ దుకాణాలు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి మహేందర్, ఏఈవో సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.



1నుంచి 19ఏళ్ల పిల్లలకు..

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

● కలెక్టర్ రాజార్షిషా ● ఈనెల 20న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం ● అధికారులతో సమీక్ష సమావేశం




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14: ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు 1-19 సంవత్సరాల పిల్లలందరికీ తల్లిదండ్రులు తమ పిల్లలకు, విద్యార్థులకు ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్ర అల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 20న జరుగనున్న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్బెండజోల్ మాత్రం పంపిణీ ఏర్పాట్లపై లైన్ డిపార్మెంట్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 1-19 వయస్సు గల చిన్నారులు, విద్యార్థులు 2,21,141 మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్‌లలో, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 20న మిస్సయిన వారికి 27వ తేదీని కచ్చితంగా మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా అల్బెండజోల్ మాత్రలు పిల్లలందరికీ వేయించాలని సూచించారు. మాత్రల పంపిణీపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా లెవల్ కన్వర్జెన్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం పిల్లలను చేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మండలాల వారీగా లక్ష్యాలను సాధించేందుకు ఎంఈవోలు బాధ్యత తీసుకొని పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలాగా కృషి చేయాలన్నారు. గతం కంటే ఈ యేడాది ఎక్కువ అడ్మిషన్లు జరగాలని ఆదేశించారు. మండలాల్లో సమావేశాలు నిర్వహించుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రైమరీ స్కూల్‌లో చేర్పించాలని, బడి ఈడు పిల్లలను గుర్తించి స్కూల్లో చేర్పించాలన్నారు. మండలాల వారీగా ఇప్పటి వరకు నమోదైనా పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీడబ్ల్యువో, సీడీపీవో, డీఈవో, హెల్త్ డిపార్ట్‌మెంట్, డీఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, డీఈవో, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు డబ్బులు అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

● కలెక్టర్ చొరవతో రైతులకు డబ్బులు

ఆదిలాబాద్ అర్బన్: గతంలో పోస్టాఫీస్ అధికారి తప్పిదం వల్ల మోసపోయిన రైతులకు శుక్రవారం ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా పత్తి రైతులకు రూ.కోటీ 15లక్షలు 75 మంది రైతులకు డబ్బులను జిల్లాకేంద్రంలోని పోస్టాఫీసులో కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు రైతులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో పోస్టాఫీసు రైతుల ఖాతాలో గతంలో సీసీఐ నుంచి డబ్బులు జమ చేసిన సంఘటనలో ఓ అధికారి తప్పిదం 75 మంది రైతులు ఖాతాలలో జమ అయిన డబ్బులు మాయమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సంఘటనపై కలెక్టర్ ప్రత్యేక చొరవతో మూడు నెలల్లోనే రైతుల సమస్యలను పరిష్కరించారు. రూ.కోటీ 15 లక్షలు 75మంది రైతులకు పోస్టాఫీసు ద్వారా రైతులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని అంతా ఆన్‌లైన్ సిస్టం ఉన్నా కూడా చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈసారి కూడా మంచి పంట దిగుబడి రావాలని అన్నారు.



నర్సాపూర్ ఆశ్రమ పాఠశాలలో బాలికల వసతి సౌకర్యాలు పరిశీలిస్తున్న పీవో

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, జూన్ 14: ఉమ్మడి జిల్లాలోని జరిగిన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవవారం ఉట్నూర్ మండలంలోని నర్సపూర్(బి)లోని బాలికల ఆశ్రమ పాఠశాలను, సాలెగూడలోని కొలం విద్యార్థుల శాటిలైట్ సెంటర్‌లను పీవో ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, బోజనం పై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా మరమ్మత్తులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

ఉట్నూర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రిలిమ్స్ మెయిన్స్ ఇంటర్వ్యూలకు 2025 సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ ఇవ్వనున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఏం మేరకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, అప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతుందన్నారు.దరఖాస్తులు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదని పీవో పేర్కొన్నారు. అలాగే ఈ నెల 30వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నెం.6281766534, 903238399 ద్వారా ఉదయం 10.30 గంటల నుంచి 5గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : ఎంపీపీ

● సాదాసీదాగా తలమడుగు సర్వసభ్య చివరి సమావేశం

తలమడుగు, జూన్ 14: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్ కోరారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య చివరి సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సందర్భంగా మండలస్థాయి వివిధ శాఖల అధికారులు వారి శాఖల నివేదికలను ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికారుల సహకారంతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పాస్, ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ కనెక్షన్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలు పరుస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆగస్టు 15లోగా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించడం ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఇందులో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, మండల ఉపాధ్యక్షురాలు దివ్య, పీఆర్ఏఈ మజార్, ఏపీవో మేఘమాల, స్వామి, మండల పశువైద్య అధికారి దూరం రాథోడ్, వైద్యాధికారి హరీష్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్, సర్పంలు, మిషన్ భగీరథ ఏఈ మహేష్, ఎంపీటీసీలు, ఆయా గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ, పాల్గొన్న ఎంపీడీవో, అధికారులు